# సనాతన ధర్మమే జగత్తుకు ప్రాణము

సకల శాస్త్ర పురాణ సంగ్రహవేత్తయై
వేదాంత వేద్యుడౌ విబుధుడైన
రక్తియేపారగ రమ్య హర్మ్యంబుల
రమియించు రాజ చంద్రముడునైన
రణరంగమందు పరాభూతరిపుడౌచు
వెలుగొందు జగదేక వీరుడైన
దారిద్ర్యదేవతా దాక్షిణ్యమున కుందు
దౌర్భాగ్యవిభుడగు దాసుడైన
భక్తిలేనిచో ఎందుకు పనికిరాడు
భక్తిరహితుడగు జగద్భర్త కన్న
భక్తి పరుడగు దాసుడే వంద్యుడగును
ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపరతు
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార.

దివ్యాత్మస్వరూపులైన విద్యార్థులారా! విద్యార్థినులారా! విద్యాధికారులారా! విద్యాభిమానులారా!

మనము యీనాడు శాస్త్రవిజ్ఞాన సముదాయమును పొందినాము కాని ఇది బహిరమైన నాగరికతను మాత్రమే అందిస్తున్నది. మనకు కావలసినది హృదయ పరిపాకము. ఇది ఆంతరికమైన సంస్కృతిని అందిస్తుంది. విద్యార్థికి మేధావికాసముతో పాటు హృదయ విశాలతనుకూడ కలిగిస్తుంది. మానవుని దయామయునిగా మార్చే చైతన్యము విద్యలో వున్నప్పుడే విద్య పరిపూర్ణమవుతుంది. స్వార్థపరునిగా సంకుచిత వ్యక్తిగా విద్యార్థి

sri sathyasai vachanamrutam

మారరాదు. శిక్షణతోపాటు హృదయనిర్మలతనుకూడా పెంచాలి విద్య. అప్పుడే క్రమశిక్షణ ఏర్పడుతుంది. క్రమశిక్షణలేని చదువు చదువేకాదు. విద్యార్థికి భయము, భక్తి, విశ్వాసము యీ మూడు అత్యవసరముగా వుండవలసినవి. భయమనగా పాపభయము. పరదూషణ, పరహింస, శీలరహితమైన కర్మలు పరులను నొప్పించటము, సంస్కృతిని విస్మరించటము యివన్ని పాపముతో కూడినవి. ముఖ్యముగా శీలరహితమైన కర్మలకు పాల్పడడం మహాపాపం. విద్యార్థి, విద్యార్థినులకే గాక సర్వమానవులకు శీలమే ప్రాణము. శీలరహిత కర్మల విషయములో విద్యార్థులు అతి జాగ్రత్తగా మెలగవలసి వుంటుంది.

**'పాపములన్నిటికి మించినది పరులను నిందించటమే!'**

త్యాగశీలము, పవిత్రత, గుణపోషణ అత్యవసరముగా విద్యయందు వుండియే తీరాలి. దుష్టమార్గములలో ప్రవేశించకుండా వుండటమే విద్యార్థి ప్రథమ కర్తవ్యము. పరదూషణ చేయటమేకాక వినటంకూడా పాపమే! పరదూషణ, దూషణ శ్రవణము, పరనింద, పరులను బాధించడము-ఇవి మహాపాపములని ధర్మశాస్త్రము చెప్పుతున్నది. సామాన్యమానవుని నిందించటమే పాపమైనపుడు సర్వాంతర్యామి, సర్వజ్ఞుడైన భగవంతుని నిందించటము ఎంత గొప్ప పాపము! 'పాపములన్నింటికంటే మించినది పరులను నిందించేదన్నా!' అన్నారు. ఇట్టి పాపానికి పాల్పడకుండా వుండాలి విద్యార్థులు.

**విష్ణుత్వముతో మానవత్వమును ఐక్యము గావించుటే భక్తి**

ఇంక భక్తి-భక్తి అనగా జపములు, పూజలు, ధ్యానము చేయటం మాత్రమేకాదు. భగవంతునియొక్క సేవయే భక్తి. మానవుడు నిరంతరము భగవంతుని చింతన, స్మరణలతో వున్నప్పుడే హృదయము ద్రవిస్తుంది. భగవంతునిపై ధారాపాతమైన ప్రేమ జనిస్తుంది. ఇట్టి మానసిక పరివర్తనమే భక్తి. సాధకుని ఆసక్తి, అభిమానము, మమకారము, ప్రేమ-యీ అన్నింటిని భగవంతునిపైకి మరల్చటమే భక్తి. భగవంతుని ప్రేమరసామృతములో మునిగి, తన దేహమునే మరచి దివ్యత్వముతో పవిత్రమైన కాలమును అనుభవించమే భక్తి. భక్తుడు, భగవంతుడు వేరుకానటువంటి ఏకత్వస్థితిని అనుభవించటమే భక్తి. భగవంతుడు విశ్వస్వరూపుడు. విశ్వమంతా భగవంతుని స్వరూపముగా కనుపిస్తుంది భక్తియందు.

srisathyasaivachanamrutam

'విశ్వంవిష్ణుమయం' అన్నారు. విష్ణువనగా సర్వ వ్యాపకత్వాన్ని బోధించేది, సర్వజ్ఞత్వాన్ని తెలిపేది, సర్వశక్తిమయుని నిరూపించేది. ఇట్టి విష్ణుత్వముతో మానవత్వమును ఐక్యము గావించుకునే పవిత్ర మార్గమునకే 'భక్తి' అని పేరు. లౌకిక దృష్టితో పరికించినప్పుడు సర్వులనూ ప్రేమించే విధానమే 'భక్తి' అనిపిస్తుంది.

మొట్టమెదట మన తల్లి తండ్రులను ప్రేమించాలి. తదుపరి గుణవికాసమును, బుద్ధివిశాలతను కల్పించే గురువులను ప్రేమించాలి. పవిత్ర మానవ జన్మమును అందించిన దేశమును ప్రేమించాలి. ప్రతి మానవునియందున్న దివ్యమైన అనంతత్వాన్ని విశ్వసించాలి. ఈశావాస్యమిదంసర్వమ్-సర్వులయందుకూడ ఈశ్వరుడు వున్నాడనే సత్యాన్ని విశ్వసించాలి. తోటి మానవులను ప్రేమించాలి. ప్రేమలేనిహృదయము చీకటి మందిరము. అందులో కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే గబ్బిలాలకు ప్రవేశముంటుంది. ఇవి ప్రవేశించినగది మాలిన్యముతో కూడి వుంటుంది. అట్టి దుర్గంధముతో కూడుకొని వున్న హృదయములో కేవలం దుర్భావములే ఆవిర్భవిస్తుంటాయి. దుర్భావము ఆవిర్భవించినప్పుడు మానవుడు దుష్టుడై ప్రవర్తిస్తాడు. దుష్టుడు మృగముతో సమానము. కనుక, విదార్థులు తమ హృదయమునందు ప్రప్రథమముగా భక్తిని ఆవిర్భవింపజేసుకోవాలి.

భక్తి అనగా నిర్మల, నిశ్చల, నిస్వార్థ, ప్రేమతత్త్వమే. ఇలాంటి ప్రేమను, ప్రేమతో కలపటమే ప్రధానమైన సాధన. ప్రేమవలన శ్రద్ధ ఏర్పడుతుంది. శ్రద్ధవలన జ్ఞానము చేకూరుతుంది. జ్ఞానమువలన సాధన కుదురుతుంది. సాధనకు ఫలితము సాధ్యము-లక్ష్యము. ఇట్టి ప్రేమ తత్త్వాన్ని మానవుడు అభివృద్ధి పరచుకున్నప్పుడే దివ్యత్వమనేదానిని దర్శించటానికి అర్హుడౌతాడు.

**విశ్వాసములేని మానవుడు మృతదేహముతో సమానుడే**

ఇంక మూడవది విశ్వాసము. విశ్వాసమే లేకున్న మానవుడు యీ జగత్తునందు క్షణమైనా జీవించలేడు. దేనియందు విశ్వాసము? మొట్టమొదట తనయందు తనకు విశ్వాసము కుదరాలి. తనయందు విశ్వాసము కుదిరినప్పుడే దైవమునందు విశ్వాసము

sri sathyasai vahamrutam

అభివృద్ధి అవుతుంది. దైవవిశ్వాసమును బలపరచుకోవలెనన్న సత్యమును బలపరచుకోవాలి. ధర్మాన్ని విశ్వసించాలి. తన దివ్యత్వముపైన విశ్వాసము అభివృద్ధిపరచుకోవాలి. విశ్వాసమే ప్రాణమని భావించాలి. విశ్వాసము లేని దేహము మృతదేహమే. విశ్వాసమే లేని విద్యార్థి విద్యనుకూడా అభ్యసించలేడు. మనము చేసే ప్రతి కర్మయందుకూడా విశ్వాసము అభివృద్ధి పరచుకొని ఆచరించినప్పుడే కర్మఫలమును అందుకొనటానికి అధికారులమవుతాము. కనుక, విద్యార్థికి భయము, భక్తి, విశ్వాసము-యీ మూడింటితో కూడిన విద్యను బోధించటమే నిజమైన విద్యాబోధన. దీనినే జాతీయవిద్య అనికూడ చెప్పవచ్చు. ఇటువంటి జాతీయవిద్యను ప్రతి విద్యార్థి అభ్యసించినప్పుడే దేశము ఆదర్శవంతముగా రూపొందుతుంది.

**విద్య నిస్వార్థము, వినయము, నిరాడంబరము అనే మూడు గుణములతో కూడి ఉండాలి**

విద్య అనగా మానవునినుండి ఆవిర్భవించే దివ్యతేజస్సు. ఇది నిస్వార్థము, వినయము, నిరాడంబరము, ఈ మూడు గుణములతో కూడివుండాలి. నిరాడంబరము విద్యార్థికి చాలా అవసరము. నిరాడంబరముగా వుండే విద్యార్థికి విద్యనభ్యసించే అవకాశము వుంటుంది. వినయ విధేయుడుకావాలి విద్యార్థి

**విద్యయొసగును వినయంబు**
**వినయమునను కలుగుపాత్రత**
**పాత్రతవలన ధనము ధనమువలనను ధర్మంబు**
**దానివలన ఐహికాముష్మికంబు బొందు నరుడు**

ఈనాటి విద్యార్థికి వినయమంటే యేమిటో అర్థమే కావటంలేదు, తెలియటంలేదు. పెద్దలను చూసి గౌరవించాలి. పెద్దలదగ్గర నిరాడంబరంగా మెలగాలి. మొట్టమొదట తల్లితండ్రులను గౌరవించాలి. ఎందుకు! మనదేహమే వారిది. మనసర్వస్వమూ వారివే. అట్టి వారికే కృతజ్ఞత నందించకున్న యింకెవరికి అందించేది? మనకు అన్నింటినీ అందించిన మహాశక్తి ఒకటున్నది.

**విద్య భౌతిక విజ్ఞానముతోపాటు వినయ విధేయతలు, త్యాగశీలత, దివ్యత్వములను**

sri sathyasai vachanamrutam

**బోధించాలి**

ఈ ప్రపంచములో నిప్పు, నీరు, గాలి, భూమి, ఆకాశము యీ అన్నింటినీ మానవునికి అందించి, నిత్యజీవితములో ఎట్టి ఆటంకము లేకుండా జీవితమును సుఖ, శాంతులతో అనుభవించగలిగేటట్లు చేశాడు భగవంతుడు. ఇందులో ఏ ఒక్క భూతము లేకున్నా మానవుడు క్షణమైన నిలువలేడు. భగవంతుడు అందించిన పంచభూతములను అనుభవిస్తూ అందించిన అధికారినే గౌరవించకున్న మానవత్వానికి విలువేమున్నది? కనుక, అన్నింటినీ అందించిన ప్రభువుకు మనము కృతజ్ఞత నందించాలి. అదేవిధముగనే మనదేహమునకు తమ అంగములద్వారా సారమును అనుభవింపజేసి తద్వారా మానవరూపములో మనలను యీ జగత్తునకు అందించిన తల్లితండ్రులను ప్రప్రథమముగా గౌరవించాలి. వారిని ప్రసన్నులను చేయటమే వినయానికి ప్రధాన స్వరూపము. కనుకనే విద్యాబోధనలో మనము అతి జాగ్రత్తగా మెలగవలసివుంటుంది. భౌతిక విజ్ఞానమును అందించటము మాత్రమే విద్యకు లక్ష్యము కానేరదు. ఇది ప్రపంచప్రగతినే వమ్ము చేస్తుంది. విజ్ఞానముతో బాటు వినయ విధేయతలను, త్యాగశీలతను, దివ్యత్వాన్ని, జీవిత అంతర్భాగములుగా మనము భావించాలి.

నేటి మానవుడు అనేక సిద్ధాంతములను స్థాపిస్తున్నాడు. ప్రాకృత వస్తు విచారణద్వారా ఎన్నో తెలుసుకోగలుగుతున్నాడు. అనేక పరిశోధనలతో విశ్వాన్ని సాధించటానికి ప్రయత్నిస్తున్నాడు. కానీ, మానవుడుగా తాను ఎన్ని గుణములను సాధించుకోగలుగాడు. మానవత్వ లక్షణములను ఎన్నింటిని పోషించుకోగలిగాడు? మానవత్వ గుణములను పోషించుకోలేని పరిశోధనలు నిరుపయోగమైనవి. విద్యమానవులను విద్యాపారంగతులను చేసి అంతటితో ఆగిపోరాదు. మానవులను నిజమైన మానవులుగా తీర్చిదిద్దటమే విద్య లక్ష్యము. మానవత్వ గుణములందు పంచ భూతములతో కూడిన పరతత్త్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి. తత్త్వజ్ఞాని అయినంత మాత్రమున ప్రయోజనము లేదు. మానవత్వాన్ని కూడా విచారణ ద్వారా గుర్తించాలి. మానవత్వాన్నే గుర్తించలేనివాడు తత్త్వజ్ఞాని కావటమంటే కృత్రిమంగా వుంటుంది. మానవత్వ గుణములైన

srisathyasaivachanamrutam

సత్యధర్మశాంతిప్రేమ అహింసలు. ఇవే పంచభూతములు-పంచప్రాణములు. ఈ పంచ ప్రాణములలో యే ప్రాణమును కోల్పోయినా మానవుడు పూర్ణుడు కాలేడు.

**కేవల గ్రంథపరిచయము, పదములకు అర్థము చెప్పటం విద్యకాదు**

కనుక, విద్యార్థి సత్యమార్గములో ప్రవేశించి ధర్మమును ఆచరించి శాంతి జీవితాన్ని గడపి, ప్రేమ తత్త్వములో ప్రకాశించి అహింసా మార్గములో అంతముకావాలి. ఇదే మానవుని గమ్యము. ఇదే మానవత్వానికి ధన్యము. ఇదే మానవుడు చేయవలసిన పుణ్యము. ఇలాంటి విద్యను అభ్యసించినప్పుడే విద్యావంతులమని చెప్పుకోగలము. కేవలము గ్రంథ పరిచయము, పదములకు అర్థము చెప్పగలగటము విద్య కానేరదు. హృదయకవాటమును తెరచినప్పుడే విద్య విశిష్టతను గుర్తించటానికి వీలవుతుంది. హృదయ కవాటమును తెరచినప్పుడే అందులోని దివ్యత్వము మనకు అర్థమవుతుంది. ఇట్టి దివ్యత్వాన్ని అర్థము చేసుకొనలేక నిత్యజీవితములో సత్యమార్గమును వెదకటము సాధ్యం కాదు. కనుకనే మానవుడు నిరంతరము అశాంతికి గురౌతున్నాడు. నిర్విరామకృషితో, నిరంతర తాపత్రయములతో అంతులేని ఆశలతో అర్థముకాని ఆవేదనలతో అప్రాప్యరూపప్రాప్తికై ప్రాకులాడుతూ అశాంతికి గురైన మానవునకు చక్కని దిక్కును చూపే దీపికలు యీ విద్యాజ్యోతులు. ఈ దీపికలను మనము సరైన రీతిలో పోషించుకోటానికి ప్రయత్నించాలి.

**భారతీయ సంస్కృతియందు స్త్రీలకు విశిష్టస్థానమున్నది**

ఈనాడు messengers of Sathya Sai సంస్థ వార్షికోత్సవము. పాత విద్యార్థినుల సమావేశము యీ వార్షికోత్సవము. ఈనాడు విద్యార్థినులు అతి జాగ్రత్తగా మెలగవలసిన పరిస్థితి ఏర్పడింది. భారతీయ సంస్కృతిలో పవిత్రస్థానమును పొందిన స్త్రీలయందు యేడు విధములైన శక్తులున్నట్లు భగవద్గీత చెప్పుతుంది. అట్టి శక్తి సంపన్నులైన స్త్రీలు తమశక్తిని అతి జాగ్రత్తగా వినియోగించుకోవాలి. ఆంగ్ల విద్య రాక పూర్వము భారతీయవనితలు పవిత్రమైన సంస్కృతిని పోషించుకునే విధానములందే కాలమును అంకితము గావించేవారు. ఈనాడు ఆంగ్లవిద్య అభివృద్ధితో వచ్చిన ఆడంబర జీవన కారణముగా, అర్థరహితప్రవర్తనలతో జీవితాన్ని గడపటానికి ప్రయత్నిస్తున్నారు. ఇంటియందు పూజలు



srisathyasaivachanamrutam

పునస్కారములు, గృహపరిశుభ్రత, ఆహారవిహారములయందు తగు నేర్పరితనము ద్వారా పర్వదినములు, పండుగలు వీటియొక్క విశిష్టతను నాటినుండి నేటివరకు నిలబెట్టినవారు స్త్రీలే! కాని, దురదృష్టవశాత్తు ఆంగ్లవిద్య అభివృద్ధి చెందటంచేత నేటి బాలికలకు వంటయిల్లంటే యేమిటో తెలియకుండా పోయింది. పూజాగదిలోని సుగంధము వారికి గిట్టదు. గృహ పారిశుధ్యమంటే యేమిటో వారికి అర్థమేకాదు. ఇలాంటివారు భారతీయ సంస్కృతి యేమిటో ఏ విధముగా అర్థము చేసుకోగలరు? గృహసంబంధమైన పనులు చేస్తే చేతులు మట్టి అవుతాయేమో, బట్టలు చెడిపోతాయేమో అనే భీతి వీరిలో పెరుగుతున్నది. గృహకృత్యములందు తల్లికి యేమాత్రము సహాయకారులుగా నిలవటంలేదు. తెల్లవారి లేచినది మొదలు వీరు డ్రస్సును చక్కచేసుకొనటంతోటే కాలము వ్యర్థము చేస్తున్నారు. ఇంతేకాక, వికారమైన చర్యలకు కూడా వీరు పాల్గొంటున్నారు. మన భారతీయసంస్కృతియందు కురులు చాలా పవిత్రమైనవి, చాలా శక్తివంతమైనవి. స్త్రీల వెంట్రుకలందు మహత్తరశక్తి యిమిడి వుంది. కళ్యాణమైన తరువాత సమంగళులుగా వుండవలసిన స్త్రీలు అమంగళులుగా తయారౌతున్నారు. వెంట్రుకలను కత్తిరించుకుంటున్నారు. భర్త లేనివారు చేయవలసిన పని యిది. ఇది భారతీయసంస్కృతికి అమంగళాన్ని చేకూర్చేది. ఇట్టి విద్యార్థినుల ముఖము చూడటంకూడా పాపమే! మన విద్యార్థినులు మాత్రము ఆ విధమైన దుర్మార్గములో ప్రవేశించరాదు. ఇవి యీనాటి విద్యల అవలక్షణాలు. ఈ విధమైన మన సంస్కృతిని పెంచుకొని సమాజములో ప్రవేశించి యితరులకు ఆదర్శవంతమైన జీవితాన్ని అందించాలి విద్యార్థినులు.

**భారతీయ సంస్కృతిలోని అంతర్భావమే సనాతనధర్మము**

భారతీయ సంస్కృతి ఏనాటికి మారేదికాదు. ఇది కాలగమనముతో మారక, చరిత్రగతితో మాయక, ప్రళయం వచ్చినా తరుగక, సృష్టితో పెరుగక నిరంతరము శాశ్వతమైన స్థితియందే వుంటుంది. ఇట్టి భారతీయ సంస్కృతి అంతర్భావమే సనాతన ధర్మము. ఇట్టి సనాతన ధర్మమే జగత్తుకంతా ప్రాణము. యుగములు మారినా, జగములు కదలినా మారేది కాదిది. ఇది దేశకాల పాత్రలకు అతీతమైన స్థితిలో వుంటుంది. ఒక్క



srisathyasaivachanamrutam

భారతీయులకు మాత్రమే కాదు, యావత్ విశ్వానికి దీనితో సంబంధమున్నది. ప్రకృతి సౌందర్యమును, మానవత్వ విశిష్టతను చాటే దినములే భారతీయుల పర్వదినములు. ఈనాడు పవిత్రమైన సంక్రాంతి. క్రాంతి అనగా మార్పుచెందటం. అనగా సూర్యుడు ఒక రేఖనుండి మరొక రేఖకు ప్రవేశించటము. సూర్యుడు ఒక్కొక్కనెలకు ఒక్కొక్క రేఖను ప్రవేశిస్తాడు. గడచిన ముప్పది దినములు సూర్యుడు ధనురేఖపై వుండటంచేత దీనికి ధనుర్మాసమని పేరు పెట్టారు. ఈ ధనుర్మాసములో స్త్రీలు అనేక మంగళకార్యములను చేసుకునేవారు. అనేక వ్రతములను ఆచరించుకునేవారు. ధనుర్మాసము తీరిన తరువాత మకర సంక్రమణం ప్రారంభమవుతుంది.

**సూర్యుడు నిస్వార్థపరుడు కావున మానవులుకూడా నిస్వార్థపరులుగా తయారుకావాలి**

సూర్యుడు నిస్వార్థపరుడు. అతనిది సమానత్వముతో కూడిన హృదయము. అందరియందు యేకత్వము వహించే భావము. సూర్యునికి విశ్రాంతే లేదు. నిర్విరామంగా సూర్యుడు తన కర్మను ఆచరిస్తుంటాడు. సంక్రమణము మనకు నేర్పే పాఠము యేమిటంటే సూర్యునితోపాటు మనము కూడా సూర్యుని అడుగుజాడలలో నడవటమే. సూర్యుడు నిస్వార్థపరుడు. కనుక, మానవులు కూడా నిస్వార్థపరులుగా తయారుకావాలి. సూర్యుడు నిరహంకారి. ఇంతపని చేస్తున్నానని అహంకారము అతనికి ఏకోశానా లేదు. సూర్యుడే లేకపోతే జీవితమే లేదు. అన్ని విధములా ప్రకృతిని సౌందర్యవంతం చేసేవాడు సూర్యుడు. సూర్యునివలననే సమస్త సృష్టి, స్థితి, లయములు జరుగుతున్నవి. ఇంత బాధ్యతను వహించిన సూర్యునిలో అహంకారమేమాత్రము కనుపించదు. అల్పబుద్ధులతో అల్పపుపనులు చేసే వ్యక్తులకే యిట్టి అహంకారము. తెలుగునాడులో చెప్పుతుంటారు-అన్నీ వడ్డించిన ఆకు అణిగి మణిగి వుంటుందట, ఏమీ వడ్డించని ఆకు ఎగిరెగిరి పడుతుందట! నిండు కుండ తొణుకుతుందా? తొణకదు. ఖాళీ వుండే పాత్రలే తొణికేవి. పూర్ణుడైన సూర్యునియందు ఇట్టి అల్పభావములు యేమాత్రము కన్పించవు. కనుక, సూర్యునివలే ప్రతి మానవుడుకూడా నిరహంకారిగా తయారుకావాలి. వేదమునందు "చంద్రమా మనసోఽ జాతః, చక్షోస్సూర్యో అజాయతః ముఖాదింద్రశ్చ...." అని వుంది. చంద్రుడు మన మనస్సని,

చక్షువులు సూర్యుడని భావించుకుంటున్నారు. ప్రతి మానవునియందు సూర్య అంశ వుండటంచేత సూర్యుని అడుగుజాడలను అనుసరించటం మానవుని ప్రధానకర్తవ్యము.

ఈనాడు సూర్యుడు ఉత్తర దిశకు ప్రయాణము అవుతున్నాడు. ఆరునెలలు ఉత్తరమునకు, ఆరునెలలు దక్షిణమునకు సూర్యుని ప్రయాణము. విజ్ఞాన శాస్త్రప్రకారము సూర్యుడు కదిలేవాడుకాదు. భూమి తిరగటంచేతనే సూర్యుడు తిరిగినట్లు మనకు కనిపిస్తున్నది. అతను దక్షిణమునుండి ఉత్తరమునకుగానీ, ఉత్తరమునుండి దక్షిణమునకుగాని ప్రయాణము చేసేవాడుకాదు. అతను నిత్యుడు, పరిపూర్ణుడు, అచలుడు. కానీ చలించే మానవునకు అతను చలించినట్లు కన్పిస్తున్నాడు. నిశ్చలమైన జలములో సూర్యుడు నిశ్చలముగానే కనుపిస్తుంటాడు. అలలతో కూడిన జలములో సూర్యుడుకూడా కదలినట్లు కనిపిస్తున్నాడు. కానీ సూర్యుడు కదలుతున్నాడా, జలము కదులుతున్నాదా? అదే విధముగా మానవుని మనస్తత్వము కదలినట్లే సూర్యుడు మార్పుచెందినట్లుగా, ప్రయాణము సలుపుతున్నట్లుగా మనకు కన్పిస్తున్నది.

**ఉత్తరదిశకు ప్రయాణం కావటం అంటే ఈశ్వరుని మార్గమును అనుసరించటం**

ఆధ్యాత్మిక శాస్త్రములో సూర్యుడీనాడు ఉత్తర దిశకు ప్రయాణము కావటానికి ఒక విశిష్టమైన అర్థముంది. దేవతలకు యీ ఆరునెలలు పగలు అని దీని అంతరార్థము. ఉత్తర దిశయందు ప్రయాణం కావటం ఈశ్వరుని మార్గమును అనుసరించటం. ఇంతేకాక లౌకిక దృష్టితో చూచినప్పుడు ఈ ప్రపంచమంతా చక్కగా ప్రకృతి సౌందర్యముతో కళకళలాడుతూ వుంటుంది. సామాన్యప్రజలందరు యీ మాసములో ఎట్టిపనులు లేక ఇళ్ళలో విశ్రాంతి ననుభవిస్తూ వుంటారు. అన్నిరకముల పంటలు యింటికి చేరటంచేత తిండి, తీర్థాదులకు ఎట్టి యిబ్బంది లేకుండా అనుభవిస్తూంటారు, ప్రజలు. వాతావరణంకూడా సమశీతోష్ణంగా వుంటుంది. సూర్యుడుకూడా ప్రశాంతమైన రూపములో ప్రజలకు ఆనందమును అందిస్తుంటాడు. దీనికి పూర్వము రాత్రివేళ అధికముగా వుండేది, పగటిపూట కాలం తక్కువ. నేటినుండి పగలు ఎక్కువ, రాత్రి తక్కువ. దినముకూడా చాలా ప్రశాంతముగా వుంటుంది. అందుకే కవులు చెప్పారు.

sri sathyasai vachanamrutam

దినకరుడు శాంతుడై తోచె
దినము లంతయు కురుచనయ్యెను
చలిగాలి చురుకుహెచ్చె
పొలములందున రేయి గుడ్డివెన్నెలలోన
కుప్పలన్ నూర్చు కాపులు గొంతులెత్తి
పదములన్ పాడ దొడగిరి
పచ్చపువ్వులు జనుప చేలకు
ముత్యాలు సరులు గూర్చె
మిరప పండు కుంకుమ మెరుపుదాల్చె
బంతి పువ్వులు మొగము లల్లంత విప్పె
మనగృహంబుల ధాన్యసంపదలు నిల్చె
సరసురాలైన సంక్రాంతి పండుగొచ్చె

సంక్రాంతి పండుగ అనేకానేక భౌతిక సంపదలతో, ప్రాకృతిక సౌందర్యములతో కూడి మానవునికి ఆనందాన్ని అందిస్తుంది. కనుకనే సంక్రాంతి భారతీయులకు చాలా ప్రధానమైన పర్వదినము. ఇది దైవమువైపు ప్రయాణము సలిపే నెల. ఉత్తర దిశ అనగా హిమాచల పర్వతమువైపు. హిమమనగా నిర్మలమైనది. చల్లదనముతో కూడినది. అచలమనగా చలించనిది. నిర్మలము, నిశ్చలము, ప్రశాంతితో కూడిన హృదయస్థాయికే హిమాచలమని పేరు. అట్టి హృదయవాసి ఈశ్వరుడు. అందువలననే 'ఈశావాస్య మిదంసర్వం'-అందరియందును ఈశ్వరుడు వాసం చేస్తున్నాడు. 'ఈశ్వరస్సర్వభూతానాం' సర్వులయందు ఈశ్వరుడే వుంటున్నాడు అన్నారు. కనుక, ఈశ్వరస్థాయి మనహృదయమునందే వుంటున్నది. ఏనాడు మన దుర్గుణములను, దుర్భావములను, దురాచారములను, దూరం చేసుకొందుమో ఆనాడు మన హృదయము పవిత్రమవుతుంది. ప్రతి మానవుడు పవిత్రమైన హృదయాన్ని అభివృద్ధి చేసుకోవాలి. చంచలత్వాన్ని తొలగించుకొని హృదయాన్ని పరిశుద్ధము చేసుకోవాలి. స్వార్థాన్ని త్యాగం చేసి నిస్వార్థమైన నిర్మలత్వాన్ని పోషించుకోవాలి. అల్ప బుద్ధులచేత అహంకారపడకూడదు. భగవంతుని

sri sathyasai vachanamrutam

ప్రేమ, విశ్వాసాలను హృదయమందు దాచుకోవాలి. పరిపూర్ణమైన ప్రేమగల హృదయానికి భయమేమాత్రము వుండదు. టిక్కట్టు కొని జేబులో పెట్టుకొని రైల్లో ప్రయాణం చేసినప్పుడు ఏ థర్డుక్లాసో అయినా మనకు భయము వుండదు. టిక్కట్టు కొనకుండా ఫస్టుక్లాసులో కూర్చున్నా భయంగానే వుంటుంది. టిక్కట్టు కలక్టరు ఎప్పుడు వస్తాడో ఎప్పుడు బయటకు నూకుతాడో అని భయం. భగవంతునిపై ప్రేమ, భగవద్విశ్వాసము అనే టిక్కట్లు హృదయములో పెట్టుకున్నప్పుడు ఎక్కడున్నా భయము లేదు. ఈ ప్రేమ అనే టిక్కట్టు మన దగ్గర లేనప్పుడు ఏ చిన్న కష్టములకైనా ఏ చిన్న విచారములకైనా, ఏ చిన్న నష్టములకైనా మనము కృంగి కృశించి కూలిపోతుంటాము.

## ప్రేమస్వరూపుడైన పరమాత్ముని ప్రేమద్వారానే దర్శించాలి

భయమునకు మూలకారణమేమిటి? భగవత్ప్రేమ లేకపోవటమే! భగవద్విశ్వాసము లేకపోవటమే! భగవత్ప్రేమ గలిగిన హృదయం మంచి వజ్రముగా తయారౌతుంది. వజ్రమును వజ్రముతోనే కోయటానికి వీలవుతుంది. దైవప్రేమకు దైవప్రేమతోనే మార్చుకోవాలి. ప్రకాశించే చంద్రుని చూడటానికి టార్చిలైటు, లాంతరు తీసుకోనక్కరలేదు. చంద్రుని ప్రకాశంలోనే చంద్రుని చూడవచ్చు. ప్రేమస్వరూపుడైన పరమాత్ముని చూడాలంటే ప్రేమద్వారానే చూడాలి. అన్యమార్గములు దీనికేమాత్రము పనికిరావు. కనుక, ప్రేమయే ప్రధానమైన ధర్మము, మానవునకు. దీనికి దూరమై పోతిమా, ఆ ఎడబాటును ఏ మాత్రము సహించలేము. నిజమైన భక్తుడు భగవంతుని ప్రేమకు ఎడబాటుకు ఏ మాత్రము ఓర్చుకోలేడు. మోహన కృష్ణుని మురళిని విన్నంతమాత్రముననే గోపికలు తమ గృహములు వదలి వనములు ప్రవేశించేవారు. భాగవతము చదివిన వ్యక్తులకు యీ విషయము చక్కగా అర్థమవుతుంది. అడవులలో చేరిన గోపికలు కృష్ణుని రూపమును చూడలేకపోవటముతో ఆ వియోగదుఃఖముతో మొక్కను, పువ్వుపువ్వును, వృక్షవృక్షమును ప్రశ్నించుకుంటూ వెళ్లారట, మా కృష్ణుడు ఎక్కడ? మా కృష్ణుడు ఎక్కడ? చెప్పండని. కృష్ణుడంటే ఎవరో యీ మొక్కలకు తెలియదేమోనని ఆ కృష్ణుని రూపాన్ని వర్ణించుకుంటూ వెళ్లారట!

**నల్లనివాడు పద్మనయనంబులవాడు**

sri sathyasai vachanamrutam

**కృపారసంబు పై జల్లెడివాడు**
**మౌళి పరిసర్పితపింఛమువాడు**
**నవ్వురాజిల్లెడు మోమువాడు**
**మాసర్వము దోచినవాడు**
**ఓ మల్లియలార! మీపొదల చాటున**
**లేడుగదమ్మ చెప్పరే!**

ఒక్కొక్క పుష్పాన్ని సైతము "ఓ పుష్పమా యిలాంటివాడు మీ పొదలచాటు నేమైనా వున్నాడా? మొక్కలచాటు నేమైనా వున్నాడా? ఓ వృక్షములారా! మీలో ఏమైనా దాగున్నాడా చెప్పు"మని ప్రార్థించేవారు గోపికలు. ఒక్క క్షణమైనా కృష్ణుని ఎడబాటును సహించుకొనలేనివారు. ఇట్టి గోపికల భక్తిని సందేహించాడు, ఉద్ధవుడు. సందేహములు ఎప్పుడు కలుగుతాయి? పరిపూర్ణప్రేమ లేనివానికి యీ సందేహములు కలుగుతాయి. వీరు అనేక ఆపోహలతో ఏవేవో కథలు అల్లుతూ వుంటారు. నిజమైన భక్తులయొక్క ప్రేమతత్త్వము చలించనిదిగా వుండాలి. భగవంతుడు వరించేదిగా వుండాలి, భరించేదిగా వుండాలి. జన్మను తరింపజేసేదిగా వుండాలి. ఇదే నిజమైన ప్రేమతత్త్వము. ఎవ్వరేమని పరిహసించినా, తూలనాడినా వీరు లక్ష్యము చేసేవారుకాదు. ఉద్ధవుడు గోపికలను ప్రశ్నిస్తాడు: 'మీ అత్తలు, మీ భర్తలు మిమ్మల్ని నిందించినా కృంగరు. ఏ విధముగా సహించగలుగుతున్నారమ్మా' అని. గోపికలు చక్కని సమాధానము చెప్పారు, 'కాకులు అరుస్తున్నాయని కోకిల తనగానమును ఆపుతుందా ఉద్ధవా?' అని. 'లోకులు కాకులు. కాకులు అరుస్తున్నాయని మా హృదయములోని ఆ కృష్ణుని భావాన్ని ఏ విధముగా మరచిపోగలము? కృష్ణుడు మా హృదయాలలో కోకిలగా గానం చేస్తున్నాడు. ఈ కాకులకు ఏమి తెలుస్తుంది, ఆ గానమాధుర్యం, వాటిని మేము లక్ష్యము చేయము. కృష్ణుడు మాకు ప్రాణము'. అప్పుడనుకున్నాడు, ఉద్ధవుడు: 'గోపికలు సామాన్యులు కారు పూర్వపుఋషులు', అని. ఇట్టి ధైర్యము, ఇట్టి పవిత్రత, ఇట్టి సార్థకత, పరిపూర్ణమైన ప్రేమ తత్త్వము ఋషులకు మాత్రమే అబ్బుతుంది. ప్రేమ తత్త్వాన్ని గుర్తించుకోటము అందరికి సాధ్యము కాదు. నిజమైన ప్రేమ కలిగినవాడు ఎట్టి సమయములోను మార్పు చెందడు.

sri sathyasai vahamrutam

వియోగము భరించలేడు. సంయోగమునకే సర్వకాలమూ ప్రయత్నిస్తుంటాడు.

మనము నేర్చే విద్యలు, తెలుసుకొనే విషయములు, జీవించే జీవితములు, శాశ్వతములు కావు. ఇవన్నీ అనిత్యములు. అట్లని యీ విద్యలను మానకూడదు. జగత్తులో సంబంధమున్నంతవరకు మన కర్తవ్యాలను నిర్వర్తించవలసినదే! జీవితాలను సాగించవలసినదే! కష్టములను భరించవలసినదే! కానీ, లక్ష్యమునందు మాత్రము సత్యస్వరూపమైన నిత్య ప్రేమను మాత్రమే వరించాలి. నిజమైన భక్తులు ఏకాంతముగా జీవించటానికి ఒప్పుకోరు. దైవమును దూరము గావించటానికి అంగీకరించరు. రెండింటి ఏకత్వాన్నే ఆశిస్తుంటారు. నది సముద్రమును చేరినట్లు, తైలము తైలముతో కూడినట్లు, క్షీరము క్షీరముతో చేరినట్లు, జీవుడు దేవునిలో చేరిపోవాలి. ఈ విధమైన ఏకత్వమును ఆశించటమే భక్తి-ప్రపత్తి.

**ద్వారకావాసులు 'కృష్ణుడు మావాడు' అనుకోగా, గోపికలు 'కృష్ణా! మేము నీవారము' అనుకున్నారు**

భక్తికీ, పరమ భక్తికీ ఎంతో వ్యత్యాసమున్నది. లోక సంబంధమైన ప్రేమకు, దివ్యప్రేమకు చాలా వ్యత్యాసమున్నది. లోక సంబంధ ప్రేమ పరులనుండి అందుకోటానికి సిద్ధంగా వుంటుంది. పరమ పవిత్రమైన పరమ ప్రేమ పరులకు అందించటానికి సిద్ధంగా వుంటుంది. ఇది స్వార్థరహితమైనటువంటిది. ఇలాంటి పవిత్రప్రేమకు, లౌకికప్రేమకు ఏమాత్రము పోలికలేదు. కాని తెలియని వ్యక్తులు రెండింటి సంబంధమును గుర్తించుకొనలేక దానిని దీనినిగా, దీనిని దానినిగా మార్చి కొన్ని విధములైన అపోహలకు గురి అవుతుంటారు. ఇదే భాగవతమునందలి గోపికలకు, ద్వారకావాసులకు ఉన్న వ్యత్యాసము. ద్వారకావాసులు 'కృష్ణుడు మావాడు, మా బంధువు, మా సంబంధి', అనుకునేవారు. కనుక, వారికి అహంకారము పెరిగిపోయింది. అహంకారమేనాటికైనా అధఃపతనము చేస్తుంది. కనుకనే యాదవులకు పతనమేర్పడింది. గోపికల భావం అట్టిదికాదు. 'కృష్ణా! మేము నీవారము', అని తమ్ముతాము అర్పితము గావించుకున్నారు. అర్పితంగావించుకోటంచేత అనంతస్వరూపంగా రూపొందారు వాళ్లు. ఒక్కనీటి చుక్కను

sri sathyasai vahini amrutam

మన హస్తంలో పెట్టుకొంటే అది కొంతసేపటికి ఆవిరైపోతుంది. ఆకారమే లేకుండా పోతుంది. కానీ అదే నీటి చుక్కను సముద్రములో కలిపితిమా అది సముద్ర స్వరూపాన్ని పొందుతుంది. దానికింక మృత్యువేలేదు. అమృత స్వరూపాన్ని, అనంత స్వరూపాన్ని ధరిస్తుంది. ఇదే మోక్షమన్నారు.

**భారతీయుల పర్వదినములు ఆధ్యాత్మిక అర్థముతో కూడి వుంటున్నవి**

కనుక అల్పత్వమైన మానవత్వాన్ని ప్రత్యేకముగా పెట్టుకొని సాధించటమనేది కేవలం ఒక పిచ్చిమార్గము. దీనిని అనంతత్వముతో యేకం చేయాలి. ఇదే సరైన భక్తి మార్గము. ఇట్టి భక్తిప్రపత్తులతో ప్రతి పర్వదినమును మనం జ్ఞప్తియందుంచుకొని వీటికి అనేక ఆధ్యాత్మిక అర్థములున్నవనే సత్యాన్ని గుర్తించాలి. భారతీయుల పర్వదినములు ఆధ్యాత్మిక అర్థముతో కూడి వుంటున్నవి. ఈ పర్వదినములలో యిండ్లు పరిశుద్ధము చేసుకోవటం, తోరణాలు కట్టుకోటం, క్రొత్త దుస్తులు వేసుకోటం యిదంతా భౌతికరీతిగా మనము భావిస్తున్నాము. వీటి అంతరార్థము ఏమిటి? ఇంటికి తోరణములు కడుతున్నాము. అనగా మా గృహము నిరంతరము పచ్చగా సుమంగళముగా వుండాలి. పాతది, రోతది, పోవాలి. నూతనత్వము రావాలి. ఈ పర్వదినమునాడు తెల్లవారుఝామున లేచి శిరఃస్నానము చేసి నూతన వస్త్రములు ధరిస్తుంటాము. దేహమాలిన్యముతో, మనోమాలిన్యముకూడా పరిశుద్ధమైపోతుంది. వస్త్రమనగా హృదయము. నూతన వస్త్రము ధరించటమంటే నూతన హృదయాన్ని అభివృద్ధిపరచుకోవటము. భగవంతుడు లోపల, వెలుపల వుంటున్నాడు. 'అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః' కనుకనే కేవలము నూతన వస్త్రములు ధరించటమే కాకుండా హృదయములో నూతన భావములు అభివృద్ధిపరచుకోవాలి.

**కొబ్బరికాయ కొట్టడమంటే అహంకార, మమకారములనే పీచును తీసివేసి సాత్వికమైన భావములతోనిండిన హృదయమును భగవంతునికి అర్పించడం**

మనము కొబ్బరికాయలు కొడుతుంటాము. కొబ్బరికాయ అంతరార్థమేమిటి? కొబ్బరికాయకు పైన దట్టమైన పీచువుంటుంది. దానిని మేకుతో విడదీయాలి. తదుపరి దానిపై గట్టి చర్మము, చిన్నదివుంటుంది. దానిని కొట్టినప్పుడు పరిశుద్ధమైన కొబ్బరి

sri sathyasaivachanamrutam

లభిస్తుంది. అది చిప్పకు కరచుకొనివుంటుంది. మనము కొబ్బరికాయను కొట్టే సమయములో పై పీచును మొదట తీసివేస్తాము. తదుపరి యీ చిప్పను తీసివేస్తాము. కాయకొట్టటానికి లక్ష్యమేమిటి? మన లక్ష్యము కొబ్బరిపైననే. చిప్పపైనకాదు. భగవంతునికి కొట్టినట్లే కొట్టి మనమే ఆరగిస్తున్నాము. మన జీవితము ఒక కొబ్బరికాయ వంటిది. అభిమాన, మమకార, లోక వాంఛలతో చేరినటువంటిది యీ పీచు. అనేక వాసనలనే నారలతో కూడినదీ పీచు. కనుక, అభిమాన మమకారములనే యీ పీచును మొదట తీసివేయాలి. తదుపరి అహంకారమనే కొబ్బరికాయను బ్రద్దలు చేయాలి. అప్పుడు నిర్మల, నిశ్చల, నిస్వార్థమనే తెలుపు మనకు చిక్కుతుంది. అదే భగవద్గుణము. నిర్మలమైన ప్రేమ. ఆప్రేమ అహంకారమనే చిప్పతో కూడి వుంటుంది. అహంకారమనే చిప్ప, అభిమాన మమకారములనే పీచుతో చేరి వుంటుంది. అభిమాన మమకారములనే పీచే తమోగుణము. ఈ అహంకారమే చిప్ప. సాత్త్వికమే కొబ్బరి. సాత్త్వికమనే కొబ్బరిని మనము ఆరగించాలి. దాని నిమిత్తమై మన హృదయాన్ని బ్రద్దలు చెయ్యాలి. బ్రద్దలు చేయటమంటే మర్మం లేకుండా గోప్యము లేకుండా సర్వము తెలిసినవారని హృదయము అర్పితము చేయాలి. ఏకించిత్తుకూడా హృదయములో మరుగుపెట్టుకున్నా అది పవిత్రమైన అర్పణ కానేరదు. అర్పిత మనగా నాయిష్టము వుండకూడదు, అంతా నీ యిష్టమే అని. కొంతమంది అభిమానము కోసము, మమకారము కోసము, లోకదృష్టికోసము అంతా నీ యిష్టమే స్వామీ, మా యిష్టమేమీ లేదంటారు. ఇవి మాటలు మాత్రమే! ప్రాకృత సంబంధమైన స్టంట్లు. ఇవన్నీ దైవము ఒప్పేవాడు కాదు. నీవెన్ని బుక్కులు చదివినావో వాటికంటె పెద్ద బుక్కులే చదివి వుంటాడు. తాను అన్ని విద్యలు తనలోనే వుంటాయి. నీ విద్యలకుకాదు, హృదయ పవిత్రతకు మాత్రమే చిక్కుతాడు.

**భగవంతుని సన్నిధే పెన్నిధని భావించి సేవలో నిమగ్నులు కండి!**

'రాముడు పవిత్రవ్యక్తి, అతను పరమాత్మ స్వరూపుడు', అనే గాఢవిశ్వాసమున్న వానికి యే విధమైన సందేహములు వుండవు. త్యాగరాజుకు కూడా ఒక సమయములో సందేహము కల్గింది: 'నాకీ కష్టములు, నష్టములు, దుఃఖములు సంప్రాప్తించటానికి నా

sri sathyasai vachanamrutam

దోషమా రాముల శక్తి రాహిత్యమా', అని సందేహం కల్గింది. 'నాలో భక్తి లేదా లేక రామునిలో శక్తి లేదా', అని సంశయం కల్గింది. బాగా యోచించుకున్నాడు. 'లక్ష్మణుడు తక్కువవాడా, భరతుడు తక్కువవాడా, హనుమంతుడు తక్కువవాడా, వీరంతా రాముని కొలిచేవారే. అతనిలో దివ్యత్వం లేకనా? ఇవి లౌకికమైన భావాలు', అనుకొని అప్పుడు మొదలు పెట్టాడు:

**కపి వారధి దాటునా రామా**
**కలికి రోటగట్టునా**
**లక్ష్మీదేవి వలచునా**
**లక్ష్మణుండు కొలచునా**
**సూక్ష్మబుద్ధి గల భరతుడు**
**చూచి చూచి మ్రొక్కునా**
**అబ్బ రామభక్తి ఎంతగొప్పరా!**

ఓరామా! నీశక్తి చాలా గొప్పది. లేకపోతే లక్ష్మి సామాన్యురాలా! నిన్నెందుకు కొలుస్తుంది, నీ పాదము నిరంతరము ఎందుకు వదలకుండా వుంటుంది? మహాశాంతుడు, గుణవంతుడు, బలవంతుడు అయిన హనుమంతుడు నీ సేవలో నిమగ్నుడై వుండటం నీలో శక్తి లేకనా? సూక్ష్మబుద్ధిగల లక్ష్మణుడు నిన్ను నిరంతరము సేవించటంలో అంతరార్థం లేదా? లక్ష్మణుడు మహాసూక్ష్మబుద్ధి. 'శూర్పణఖ ముక్కు, చెవులు కోయి' అని కత్తి అందించలేదు రాముడు. పైకి చూసి నాలుగు వేళ్లు లెక్కపెట్టాడు రాముడు. అంటే శృతి దీనికి అర్థము. నాలుగు వేదములకు శృతి అని పేరు. శృతి అనగా వినటము అని అర్థము. కాబట్టి చెవులు కోయి అని దీని భావము. లక్ష్మణుడు యింత సూక్ష్మబుద్ధితో గుర్తించాడు. రాముడు మళ్లీ పైకి చూశాడు. పైకి చూడటమంటే నాసికమన్నట్లు. లక్ష్మణుడు అది గ్రహించి ముక్కునుకూడా కోసేశాడు. పదములతో కాక అభినయముతో అర్థమును గుర్తించగలిగినవాడు సూక్ష్మబుద్ధిగలవాడు. వీరందరూ నీవు దేవుడవనటం తెలివితక్కువైకాదు. వీరందరు విద్యావంతులు, శక్తివంతులు, ప్రజ్ఞానవంతులు. మేధావంతుల తత్త్వం తెలుసుకోక 'సాయిబాబా దగ్గరకి వచ్చేవారంతా

sri sathyasai vachanamrutam

తెలివితక్కువవారురా', అంటారు. వీరంతా తెలివితక్కువవారని చెప్పేవాడు తెలివికలవాడా, వాడే తెలివి తక్కువవాడు. ఆనాడు త్యాగరాజు కూడా అట్లే అనుకున్నాడు. లక్ష్మణుడు తెలివితక్కువవాడనుకున్నాడు. భరతుడు తెలివితక్కువవాడనుకున్నాడు. లక్ష్మి అనలే స్త్రీ కదా, ఆమె స్థితికూడా కొంచెం తగ్గుస్థాయిలోనే వుందనుకున్నాడు. కానీ వీరందరు సామాన్యులు కారు. తెలివితక్కువవాడిని నేనే అనుకొని బాధపడ్డాడు తరువాత.

ఇలాంటి వారందరు భగవంతుని సన్నిధే పెన్నిధని భావించుకొని సేవలో నిమగ్నులైవుండగా అనవసరమైన ఊహలతో జీవితాన్ని వ్యర్థము చేసుకొని దూరం కావటానికి ప్రయత్నించుచున్నాము. చిక్కిన కాలాన్ని పవిత్రం చేసుకోటానికి ప్రయత్నించాలి. ఇలాంటి పవిత్రమైన అవకాశాలను మనం సార్థకము చేసుకోవాలి. ఈనాడు పవిత్రమైన మహాపర్వదినము. సూర్యుడు దక్షిణమునుండి ఉత్తరానికి ప్రయాణము చేస్తున్నాడు. దీనినే దేవయానమన్నారు. అంటే పరమాత్ముని వైపు ప్రయాణమన్నమాట. ఆ సూర్యునితో బాటు మన బుద్ధులను కూడా దేవయానంగా మళ్లించుకుంటే మన జన్మ సార్థకమవుతుంది. ఈనాటినుండి మన భావములను పవిత్రమైన ఆధ్యాత్మిక మార్గములో ప్రవేశపెట్టి నిత్యజీవితానికి సంబంధించిన నిత్యకృత్యములందుకూడా యే మాత్రం లోటు చేయక, కర్తవ్యాలను చక్కగా నిర్వర్తించుకుంటూ ఇది యిహమునకు, అది పరమునకు అన్న లక్ష్యాన్ని హృదయమునందు అభివృద్ధి పరచుకొని రెండు విద్యలను రెండు పాత్రలుగా వహించి దివ్యమైన గమ్యాన్ని ధన్య జీవితాన్ని అందుకుంటారని ఆశిస్తున్నాను.

**(తేదీ 14-1-1986న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasaivacchanamrutam